

ఉష్ణోగ్రత (అంచనా)

13-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	28
తెనాలి	36	28
నరసరావుపేట	35	26
బాపట్ల	36	29
రెంటచింతల	36	28
చీరాల	36	29

పంచాయతీల్లో..
పైసలు లేవు

- విడుదల కాని ఆర్థిక సంఘం నిధులు
- నిధుల గండంతో ఆందోళనలో సర్పంచ్‌లు
- రూ.70.52 కోట్లు కోసం నెలలుగా ఎదురుచూపు


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలు వట్టిపోయాయి. నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి పల్లెల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు నేటి వరకు పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. నెలల తరబడి పాలక వర్గాలు ఆయా నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు రూ.70.52 కోట్లు విడుదల చేయాలని సర్పంచ్ సంఘాల నేతలు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఇటీవల కలసి వినతిపత్రం కూడా అందజేశారు. అయినా ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తొలుత కూటమి ప్రభుత్వం అమలు చేసింది. పంచాయతీలకు నవంబరులో రూ.70.04 కోట్లు విడుదల చేసి ఇచ్చిన హామీని నెలబెట్టుకుంది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని సర్పంచ్‌లు ఆశించారు. అయితే వారి సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. రెండో విడత ఆర్థిక సంఘం నిధులు రూ.70.52 కోట్లను మూడు నెలల క్రితం (మిగతా 5లో)



గ్రామపంచాయతీ కార్యాలయం, రెంటచింతల

గృహయోగం.. పేదల కల. ప్రభుత్వాల బాధ్యత. గత ప్రభుత్వం జగనన్న కాలనీలు అంటూ ప్రచారంతో సరిపెట్టింది. పదుల సంఖ్యలో కాలనీలు ఏర్పాటు చేసి వేలల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయితే నిర్మాణాల గురించి విస్మరించడంతో ఆయా కాలనీలు చాలావరకు ఇళ్లు మొండిగోడలకే పరిమితమయ్యాయి. జగనన్న కాలనీలు అంటూ స్థల సేకరణ నుంచి చదును.. నిర్మాణాలు అంటూ అక్రమాలకు పాల్పడి పేదల ఇంటి కలను వమ్ము చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి 2,12, 474 ఇళ్లు గత ప్రభుత్వంలో మంజూరు కాగా వాటిలో నాలుగోవంతు అంటే 59,999 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దృష్టి సారించి చాలావరకు లబ్ధిదారులు నగదు లేక ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని గుర్తించింది. అదనపు సహాయం చేసి ఇళ్లు పూర్తి చేయించాలని ప్రభుత్వం తలపెట్టి ప్రత్యేకంగా ఆర్థిక సాయం చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. మూడు జిల్లాలో 41,396 మందికి అదనపు సహాయం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవగా 5 వేల మంది లోపు మాత్రమే ఇప్పటి వరకు ముందుకు వచ్చారు. వారు కూడా ఇళ్ల పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



జిల్లా	మంజూరు	పూర్తి	వివిధ దశల్లో	ప్రారంభించనవి
గుంటూరు	1,00,540	24,291	41,320	34,929
పల్నాడు	61,519	19,338	22,228	19,953
బాపట్ల	50,415	16,370	15,708	18,337



గుంటూరు సమీపంలోని పేరేచర్ల లేవుట్‌లో పునాదుల దశలోనే ఆగిపోయిన ఇళ్లు

కట్టుకోమన్నా.. కదలరు

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి జగనన్న కాలనీలు, ప్రస్తుతం పీఎంఏవై ఎన్టీఆర్ నగర్లుగా మారాయి. గత ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తామనడంతో వేలల్లో లబ్ధిదారులు ముందుకు వచ్చారు. అయితే నాటి ప్రభుత్వం స్థలం ఇస్తాం.. ఇల్లు కట్టుకోమనడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలావరకు ఇళ్ల నిర్మాణాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. నిధులు లేక, ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు రాకపోవడంతో చాలామంది పనులను అసలే ప్రారంభించలేదు. ఈ పరిస్థితుల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మార్చిలో అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో ఆగిపోయిన ఇళ్ల పనులు తిరిగి ప్రారంభమవుతాయని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం అదనపు సహాయం అందించినా లబ్ధిదారుల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడడంలేదు. గుంటూరు జిల్లా వరకు చూస్తే డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో 14,112 మందికి సహాయం మంజూరు చేసింది. జిల్లాలోని 6,530 మంది ఎస్సీ, 6,369 మంది బీసీలకు రూ.50 వేలు, 1,213 మంది ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనపు సహాయాన్ని మంజూరు చేసింది. మొత్తం 14,112 మందికి 1200 మంది మాత్రమే అదనపు సహాయాన్ని (మిగతా 5లో)

- ఎన్టీఆర్‌నగర్ ఇళ్లపై కనిపించని స్పందన
- అదనపు నిధులు ఇచ్చినా మొదలు పెట్టని వైనం
- మూడు జిల్లాలో 41,396 మందికి అదనపు సహాయం
- ఇప్పటి వరకు ముందుకు వచ్చింది 5 వేల మంది లోపే

సాగర్ కాల్వల మరమ్మతులకు
రూ.3 కోట్లు

- ముప్పవరంలో రూ.3 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి



చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని సాగర్ కాల్వలను రూ.3 కోట్లతో మరమ్మతులు చేపట్టామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ముప్పవరంలో రూ.20 లక్షల ఉపాధి నిధులతో బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రెయిన్లను మంత్రి స్థానికులతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని, పూడిక, చిల్ల చెట్లతో సాగర్ కాల్వలు పూడుకు పోయాయన్నారు. చివరి భూములకు సాగర్ జలాలు చేరేలా మేజర్లు, మైనర్ కాల్వలకు మరమ్మతులు చేయించామన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మండలంలో ప్రధాన కూడలిగా ఉన్న ముప్పవరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.3 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిరు వ్యాపారులు 16 మందికి తోపుడు బండ్లను అందజేశారు. పంగులూరు, కొరిశపాడు, అద్దంకి మండలాల పరిధిలోని 126 మందికి రూ.96 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కె.వి.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, వరపర్ల సుబ్బారావు, చింత ల సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఆహార భద్రత దిశగా...
పరిశోధనలు చేపట్టాలి

- లాంఫాంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

లాంఫాం(తాడికొండ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టి అత్యుత్తమమైన రకాలను కనిపెట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లాంఫాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆడిటోరియంలో గురువారం వేడుకలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే దిశగా ఆలోచనలు చేపట్టాలన్నారు. ఎగుమతులకు అనుకూలమైన రకాలకు, సాంకేతికతను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరి బీ.రాజశేఖర్ మాట్లాడుతూ హరిత విప్లవం ఆధారితంగా రూపొందించిన సాంకేతికతపై ప్రస్తుత వ్యవసాయం ఆధారపడి ఉందని తెలిపారు. దాని నుంచి బయటకు వచ్చి పర్యావరణ సూత్రాలను ఉపయోగించి, అధిక దిగుబడిని సాధించే దిశగా పరిశోధనలు సాగాలని సూచించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ అనేక ఆటుపోట్లు తట్టుకుని 62 ఏళ్లుగా దేశంలో ఒక మంచి నాణ్యమైన విద్యని, పరిశోధన ఫలితాలను అందించే విశ్వవిద్యాలయంగా నిలబడిందన్నారు. 24 మంది ఉత్తమ రైతులకు, 16 మంది శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం..
5.94 లక్షల మందికి

మూడు జిల్లాలకు రూ.891.46 కోట్లు విడుదల



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్‌లో కీలక పథకం తల్లికి వందనం. ఈ పథకం అమలు కాదంటూ వైసీపీ చేసిన తప్పుడు ప్రచారానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అమలు చేస్తామని తల్లులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలు తెరిచిన మొదటి రోజే తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో నిరూపించుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5,94,313 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించి 891,46,95,000 నగదును విడుదల చేసింది. తల్లులు 3,86,657 మంది పథకం కింద లబ్ధిపొందుతున్నారని అధికారులు ప్రకటించారు. కాగా పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ నిధికి, రూ.2000 మినహాయించి మిగిలిన రూ.13000 తల్లుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే గురువారం రాత్రి వరకు డబ్బు జమ కాలేదని పలువురు తెలిపారు. శుక్రవారం అర్హులకు జమ అవుతుందని అధికారులు చెప్తున్నారు.

జిల్లాల వారీగా లబ్ధిదారుల సంఖ్య ఇలా ఉంది

జిలా	విద్యార్థులు	మొత్తం
పల్నాడు	2.47.393	371.08.95.000
బాపట్ల	1.45.009	217.51.35.000
గుంటూరు	2.01.911	302.86.65.000

బడిబాటలో..
అడుగులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులతో అంతా సందడి వాతావరణం నెలకొంది. కొత్త తరగతుల్లోకి సరికొత్త ఆలోచనలతో విద్యార్థులు అడుగుపెట్టారు. కొత్తగా పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు బడి బాట పట్టారు. అలాగే ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు ప్రమోషన్ పొందిన విద్యార్థులూ అడ్మిషన్లు తీసుకున్నారు.

-బాపట్ల(ఆంధ్రజ్యోతి)



కూటమి.. కోలాహలం

- జిల్లా అంతటా శ్రేణుల సందడి
- ఘనంగా ఏడాది పాలనా సంబరాలు
- పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్.. కార్యక్రమాలు
- విమాన దుర్ఘటనతో మధ్యాహ్నం నుంచి ఆగిన వేడుకలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు, శ్రేణుల్లో కోలాహలం నెలకొంది. ఏడాది పాలన ఉత్సవాలను జిల్లా అంతటా గురువారం అట్టహాసంగా జరిగాయి. ఏడాది పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తూ రాబోయే నాలుగేళ్ల వ్యవధిలో చేయబోయే పనులకు హామీ ఇస్తూ ఏడాది పాలనా ఉత్సవాలను ఘనంగా జరిపారు. నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆయా నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాల్లో ప్రదర్శనలు చేశారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నేతలు, కార్యకర్తలు, ప్రధానంగా మహిళలు, యువత సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలనతో నూతన ఒరవడిని తీసుకొచ్చారని నేతలు కొనియాడారు. కాగా గురువారం మధ్యాహ్నం భారీగా కార్యక్రమాలు చేయాలని నేతలు నిర్ణయించుకోగా అహ్మదాబాద్‌లో విమాన దుర్ఘటన నేపథ్యంలో కార్యక్రమాల్ని వాయిదా వేసుకున్నారు. గురు, శుక్రవారాలు సంతాపదినాలుగా ప్రభుత్వం ప్రకటించడంతో విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించరాదని కూటమి పార్టీలు భావించాయి. బాపట్లలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఏడాది పాలన ఉత్సవాలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శ్రేణులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకుని చీరాలలో ఎమ్మెల్యే కొండయ్య భారీ ర్యాలీ నిర్వహించారు. పర్చూరు, అద్దంకి, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో కూటమి పార్టీల నేతలు, ఏడాది పాలనా ఉత్సవాలను భారీగా జరుపుకున్నారు.



టీడీపీ బాపట్ల కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



చీరాల : మహిళా సంఘాలకు రుణంగా అందించిన రూ.3.78 కోట్ల చెక్కుతో ఎమ్మెల్యే కొండయ్య

ఆటిజం కేంద్రాలకు నిధులు

- అద్దంకి, చీరాల, బాపట్ల, రేపల్లెలో ఏర్పాటు
- స్థల పరిశీలనలో జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ జ్యోత్స్న

అద్దంకి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు ఆటిజం కేంద్రాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఐఈ కో ఆర్డినేటర్ ఎం.జ్యోత్స్న తెలిపారు. అద్దంకిలోని కాకానిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆటిజం కేంద్రం నిర్మాణానికి స్థలాన్ని గురువారం పరిశీలించారు. తిమ్మాయపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో బూదాటి సుధాకరరావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అద్దంకి, చీరాల, బాపట్ల, రేపల్లె మున్సిపాలిటీలలో ఆటిజం కేంద్రాలు నిర్మిస్తామన్నారు. ఒక్కొక్క కేంద్రానికి రూ.27.75 లక్షలు మంజూరయ్యాయన్నారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో పిల్లల్లో ఆటిజం తీవ్రతను తగ్గించి సాధారణ విద్యార్థులతో వారు మమేకమయ్యేలా శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్, శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, సీఆర్‌పీలు రామకృష్ణ, రమేష్ ఉన్నారు.




కాకానిపాలెంలో ఆటిజం కేంద్రం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ జ్యోత్స్న



సద్బోధ

వైఫల్యాలను స్వీకరిద్దాం



మానవుడి ఎదుగుదల, పరిణామ క్రమంలో అనేకసార్లు వైఫల్యాలు ఎదురవడం సహజం. వైఫల్యం కచ్చితంగా మనల్ని కుంగదీస్తుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడి నుంచి ఆత్మహత్య వరకూ... దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. కానీ వైఫల్యానికి ఒక సానుకూలమైన కోణం కూడా ఉంది. దాని నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కొత్త ఆలోచనలు చేయవచ్చు. కొత్త ఆశలు చిగురింపజేసుకోవచ్చు. ఇవన్నీ మన ప్రయాణానికి కొత్త దిశను అందిస్తాయి.

సమస్యలు శత్రువులు కాదు....

మన జీవితాల్లో విజయం కన్నా వైఫల్యమే ఎక్కువ సార్లు ఎదురవుతుందనేది ఒక వాస్తవం. కాబట్టి, వైఫల్యాలకు కుంగిపోకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి, ముందుకి సాగుతూ ఉండాలి. మనం విఫలమైనప్పుడు... అంతకు ముందు చేసిన తప్పులు మళ్ళీ చెయ్యకుండా జాగ్రత్త పడాలి. మన తప్పుల నుంచి మనం నేర్చుకున్నంతకాలం... అవి మనకి ఎలాంటి హానీ చెయ్యలేవు. విజయవంతమైన వ్యక్తులు కూడా విఫలమైన వ్యక్తుల్లాగానే వైఫల్యాలు ఎదుర్కొంటూ ఉంటారనేది నమ్మడం కష్టమైనప్పటికీ అది వాస్తవం. కానీ తేడా ఏమిటంటే... వాళ్ళు తమను తాము మెరుగుపరుచుకొని, తమ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ప్రగతి దిశగా ముందుకు సాగుతూ ఉంటారు. ఎందుకంటే విజయం అనేది వైఫల్యానికి అవతలి చివర్లో ఉంటుది. విజేతలు తమ విజయంకోసం సాగించిన పయనంలో అనేకసార్లు విఫలమైనవారే. కానీ వాళ్ళు ఒక వైఫల్యంగా తమను ఎన్నటికీ పరిగణించుకోరు. మహా భక్తురాలు, కవయిత్రి మీరాబాయి ఒక రాణి. ఆమె భర్తను కోల్పోయిన తరువాత బంధువులు ఎంతగానో వేధించారు, హింసించారు. చిత్తోడ్‌గఢ్ రాజమందిరాన్ని విడిచి ఆమె బయటకు పోవాల్సి వచ్చింది. కానీ ఈ ప్రతికూలతను ఒక అవకాశంగా ఆమె మార్చుకుంది. బృందావనానికి వెళ్ళి అక్కడే నివసిస్తూ ఆధ్యాత్మిక సంపదను పోగు చేసుకుంది. కాబట్టి గొప్పవారు తమకు ఎదురైన కష్టాలకు కుంగిపోరు. తమ అంతరంగాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఒక అవకాశంగా దాన్ని మలచుకుంటారు. సమస్యలు మనకు శత్రువులు కాదు. అవి నేర్చుకోవడానికి మనకు అనేక అవకాశాలు ఇస్తాయి. కొత్త దృక్పథంతో జీవితాన్ని చూసేలా చేస్తాయి. ఆత్మశోధనకు ఆస్కారం కల్పిస్తాయి. మనలో దాగి ఉన్న సామర్థ్యాలను బయటకు తీయడానికి దోహదం చేస్తాయి.

ఎదుగుదలే శాశ్వతం

"లోకహానౌ చింతా న కార్యా నివేదితాత్మ లోక వేద శీలత్వాత్... భక్తుడు తనను, ఈ లోకాన్ని, ఇక్కడ చేసే కర్మలను, తన ప్రవర్తనను... ఇలా అన్నిటినీ ఆ పరమాత్మకే సమర్పిస్తాడు. కాబట్టి అతను ఎటువంటి కష్టాలకు, దుఃఖాలకు చలించడు. వాటిలో దేవుడి కృపనే దర్శిస్తాడు" అన్నాడు నారద మహర్షి తన 'భక్తి సూత్రాల'లో. కష్టాల్లో కూడా దైవికమైన ఆశీర్వాదం అంతర్లీనంగా ఉందని నారద మహర్షి మనకు ఉపదేశిస్తున్నాడు. ప్రతికూలమైన పరిస్థితుల్లో మనం ప్రాపంచికమైన విషయాలకు దూరంగా జరుగుతాం. అలాంటి కష్ట సమయాల్లో భగవంతుణ్ణి మీ మనసులో స్మరించుకోండి. మీ ప్రవర్తనలను మార్చుకోవడానికి ప్రయత్నించండి. భౌతికమైన లక్ష్యాలను పెంచుకోవడం మన లక్ష్యం అయితే... ప్రతికూల పరిస్థితులను సహజంగానే ఎదుర్కోవలసి వస్తుంది. కానీ మనం ఆధ్యాత్మికమైన పురోగతిని కోరుకున్నప్పుడు... ప్రతికూలతలను ఎదుగుదలకు అవకాశాలుగా చూడడం నేర్చుకుంటాం. కష్టాల వల్ల కలిగే బాధ తాత్కాలికమని, వాటిని ఎదుర్కొని, పరిష్కరించుకోవడం ద్వారా మనలో సంభవించే ఎదుగుదల శాశ్వతమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.

● స్వామి ముక్తానంద
జేకేయోగ్ వ్యవస్థాపకుడు

దైవమార్గం

అంతరంగంతో వినాలి



మంచి ఉపమానాలతో, సామాన్యులకైనా చక్కగా అర్థమయ్యేలా హితవు చెప్పేవాడు ఏసు క్రీస్తు. ఆయన బోధల్లో వెల్లడించే ఎంతటి నిగూఢ సత్యమైనా సులువుగా అవగతమయ్యేది. అలాంటి కథల్లో ఇది ఒకటి. "ఆధ్యాత్మిక విషయాలు మామూలు చెవులతో వింటే గ్రహించడం కష్టం. వాటిని ఆత్మీయమైన అంతరంగంతో వినాలి" అంటూ ఈ కథను ఆయన ప్రారంభించాడు.

ఒక రైతు తన భూమిని దున్ని, విత్తనాలు చల్లడానికి సిద్ధమయ్యాడు. అతను విత్తనాలు చల్లుతూ ఉంటే... వాటిలో కొన్ని దారి పక్కన పడిపోయాయి. పక్షులు వచ్చి వాటిని మింగేశాయి. మరి కొన్ని మట్టి ఎక్కువగా లేని రాతి నేలలో పడ్డాయి. అవి ఎండకు మాడి పోయాయి. ఇంకొన్ని ముళ్ళ పొదల్లో పడ్డాయి. ఆ పొదలు వాటిని ఎదగనివ్వకుండా చేశాయి. మిగిలినవి సారవంతమైన నేల మీద పడ్డాయి. అవి ఒక్కొక్కటీ ముప్పై మొదలు నూరింతల వరకూ ఫలించాయి.

అలాగే ఒక వ్యక్తి ఎంతోమందికి నీతి సారాన్ని బోధిస్తున్నప్పటికీ... వాటిని గ్రహించే విషయంలో వ్యత్యాసాలు ఉంటాయి. అందరూ వాటిని వింటారు. కానీ కొందరి మనసుల్లో తిష్ట వేసుకొని ఉన్న చెడ్డ బుద్ధి వాటిని పక్కకు నెట్టేస్తుంది. దారి పక్కన పడిన విత్తనాలు అలాంటివే. మరి కొందరి మనసుసుల్లో ఆ మాటలు బాగా నాటుకోవు. అవి రాతి నేల మీద పడిన విత్తనాల్లాంటివి. ఇంకొందరు ఆ బోధలను విన్నప్పటికీ... ఐహిక బంధాలు, ధన వ్యామోహాలు వాటిని అణచివేస్తాయి. ఇవి ముళ్ళ పొదల్లో పడిన విత్తనాలు. బోధను చక్కగా విని, వాటిని బాగా అర్థం చేసుకొని, పాటించేవారు కొందరు ఉంటారు. వారు సారవంతమైన నేలలో పడిన విత్తనాల్లా ప్రయోజకులవుతారు. అందరూ ఆ విధంగా కావాలనేది ఏసు ఆకాంక్ష.

● డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024



గీతాసారం

కోరికను, కోపాన్ని వదులుకోవాలంటే..

ప్రతి తుపానుకు దాని కేంద్రంలో ఒక ప్రశాంతమైన నేత్రం ఉంటుంది. అలాగే మన కోరికలు, కోపం అనే తుపానుకు కూడా... కోరికలు, క్రోధం లేని ఒక కేంద్రం మన మనసులోనే ఉంటుంది. ఆ కేంద్రాన్ని చేరుకోవడమే మోక్షం. ఈ ప్రక్రియలో... కోరికలకు మూల కారణమైన 'నేను' అనే భావనను తృణీకరించడానికి ఎంతో ధైర్యం కావాలి. రోజువారీ జీవితంలో ఈ విషయాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి రెండు సులభమైన పద్ధతులను పాటించవచ్చు. మొదటిది... గతంలో మనం కోరికతో నిండిన అవస్థను గాని, కోపం తెప్పించిన ఒక పరిస్థితిని గాని గుర్తుకు తెచ్చుకొని, ఒక సాక్షిగా గమనించాలి. 'అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ ఒక్కటే. కానీ ప్రతి ఒక్కరూ ఒకే సత్యాన్ని అనేక విధాలుగా గ్రహిస్తారు' అనే మెరుగైన అవగాహనతో పరిస్థితిని విశ్లేషించాలి.

"కామ క్రోధ రహితులకు, చిత్తవృత్తులను జయించినవారికి, పరబ్రహ్మమైన పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందిన జ్ఞానులకూ అన్నిటిలోనూ ఆ పరమాత్మే గోచరిస్తాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి 'కోరికలు' అనే వ్యాధి నుంచి, 'కోపం' అనే వెర్రితనం నుంచి స్వేచ్ఛ పొందడం ఎలా? భారతీయ సంప్రదాయాలు జీవితాన్ని 'లీల' అంటే 'కేవలం ఒక నాటకం' అని చెప్పాయి. అందులో ఏ విషయాన్నీ తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. ఏడు నుంచి పది రోజుల పాటు మనం ఒక నాటకంలో నటిస్తున్నట్టు భావించి... దేన్నీ తీవ్రంగా తీసుకోకుండా... ఉల్లాస మనఃస్థితిలో ఉండడం అనేది రెండో మార్గం. ఇది ఒక నటుడు నాటకం కోసం కోరికను, కోపాన్ని అరువు తెచ్చుకొని, వాటిని అనుభూతి చెందడం లాంటిదే. ఒకసారి వాటిపై పట్టు సాధించిన తరువాత... మనం సుఖదుఃఖాల్లాంటి ఇంద్రియాల జాలంలో చిక్కినా కూడా... నెమ్మదిగా కోరికను, కోపాన్ని అప్పటికప్పుడే వదులుకోవడం నేర్చుకుంటాం. అంటే వర్తమానంలోనే పరమ స్వేచ్ఛను పొందడం, లేదా మోక్షాన్ని పొందడం ఎలాగో తెలుసుకుంటాం.

చివరి అడుగు పరమాత్మను శరణువేడడం. "భగవంతుడు యజ్ఞాలకు, తపస్సులకు భోక్త, సమస్త లోకాలకు, లోకేశ్వరులకు అధిపతి, సమస్త ప్రాణులకు ఆత్మీయుడు, అంటే అవ్యాజమైన దయ కలిగినవాడు, పరమ ప్రేమ స్వరూపుడు. ఈ భగవత్ తత్త్వాన్ని ఎరిగిన భక్తులకు పరమ శాంతి లభిస్తుంది" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.




కె.శివప్రసాద్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఏపీ సీఎం చంద్రబాబుతో 15న సినీ ప్రముఖుల భేటీ

● పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని సీఎం నివాసానికి 30మంది



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ నెల 15న సమావేశం కాబోతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్ర పరిశ్రమ తరఫున దాదాపు 30మంది ప్రముఖులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్నారు. సినీ ఇండస్ట్రీ అభివృద్ధి, సినిమా థియేటర్ల నిర్వహణ, చిత్ర పరిశ్రమలోని సమస్యలు, తాజా పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా టాలీవుడ్ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలవకపోవడంపై పవన్ అంతకుముందు అసహనం వ్యక్తం చేశారు. 'రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు థ్యాంక్స్' అంటూ డిప్యూటీ సీఎం చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇండస్ట్రీలో కలకలం సృష్టించాయి. సినీ నిర్మాతలు కేవలం తమ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపునకు మాత్రమే ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారని, సినీ పరిశ్రమ అభివృద్ధికి సంఘటితంగా ప్రభుత్వం వద్దకు రావట్లేదన్నారు. ఇకపై వ్యక్తులు ఇచ్చే వినతుల్ని పట్టించుకోబోమని, అసోసియేషన్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కూడా పవన్ ఆ సమయంలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు చిత్ర ప్రముఖులు పవన్ కల్యాణ్‌ను సంప్రదించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో చర్చించి సినీ పరిశ్రమ అభివృద్ధికి అందరం పాటుపడదాం అని పవన్ సూచించడంతో చలన చిత్ర రంగ ప్రముఖులు చంద్రబాబుతో ఆదివారం భేటీ కానున్నారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)

వేడుకను విజయవంతం చేయండి

-దిల్ రాజు



పద్నాలుగు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తోన్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల వేడుకను విజయవంతం చేయాలని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విమాన ప్రమాద దుర్ఘటన కారణంగా మంత్రి కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. ఈనెల 14న హైటెక్స్‌లో నిర్వహిస్తోన్న అవార్డుల బహూకరణ కార్యక్రమాన్ని ఐఅండ్‌పీఆర్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తున్నాం. ఇలా ప్రతి ఏడాదిలో మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తున్నాం. 2024 సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా ఇస్తున్నాం' అని దిల్ రాజు తెలిపారు.

అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది

- సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్



'ఓ అపర కుబేరుడు, బిచ్చగాడికి మధ్య ఇంటిలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రం 'కుబేర'. అసలు వారిద్దరూ ఒకరికొకరు ఎలా తారసపడ్డారు, వారి మధ్య పోరుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న హిందీలో కూడా పాపులర్ స్టార్స్. అందుకే మా చిత్రాన్ని హిందీలో కూడా డబ్ చేసి విడుదల చేస్తున్నాం. మొత్తం 1600కు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం. అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు అన్నారు. వారిద్దరూ నిర్మాతలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వారిద్దరూ మీడియాతో ముచ్చటించారు.

- శేఖర్ కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన మంచి ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని టచ్ చేస్తూ ఉండే సినిమాలు తీస్తారు. 'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత శేఖర్ కమ్ముల 'కుబేర' కథను మాకు చెప్పారు. తర్వాత ధనుష్ కూడా ఓకే చేయడంతో సినిమా మొదలుపెట్టాం. 'కుబేర' సినిమా అద్భుతంగా వచ్చింది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది.
- తన గత చిత్రాలకు భిన్నంగా ఈ సారి అగ్రతారలతో శేఖర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇదొక డిఫరెంట్ మూవీ. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. సినిమాలో అధికభాగం రియల్ లొకేషన్లలో చిత్రీకరించడం సవాల్‌గా అనిపించింది. ముంబైలోని మురికివాడలు, డంపింగ్ యార్డ్స్‌లో చిత్రీకరణ జరిపాం. ఇందులో ధనుష్ బిచ్చగాడిగా సాహసోపేతమైన పాత్రలో నటించారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. ధనుష్‌ను తప్ప ఈ పాత్రలో మరొకర్ని ఊహించుకోలేం. ఈ చిత్రంలో ధనుష్ రెండు పాటలు పాడారు. దేవిశ్రీ నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. నాగార్జున అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. శేఖర్ కమ్ములతో మరో సినిమా చేస్తున్నాం.

యుద్ధభూమిలో యోధుడు



గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'గోపీచంద్ 33-వర్కింగ్ టైటిల్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూపొందించిన భారీసెట్లో చిత్రీకరణ జరుగుతోంది. గోపీచంద్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం చిత్ర బృందం పోస్టర్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోపీచంద్ విభిన్నమైన లుక్‌లో కనిపించారు. యుద్ధభూమిలో వీరతిలకం ధరించిన యోధుడిగా ఆయన కనిపించారు. ఏడో శతాబ్దానికి చెందిన ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని ఓ పాయింట్‌తో సంకల్ప్‌రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని యూనిట్ తెలిపింది.

మిత్రమండలి వినోదం



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన తారాగణంగా తెరకెక్కుతోన్న చిత్రం 'మిత్రమండలి'. నిహారిక ఎన్.ఎం కథానాయిక. విజయేందర్ ఎస్. దర్శకత్వంలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. నిర్మాత బన్నీ వాసు, బీవీ వర్క్స్‌తో కలసి సమర్పిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ 'మిత్రమండలి' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బన్నీ వాసు సమర్పిస్తున్న తొలి చిత్రం ఇది. టీజర్ చాలా బావుంది. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. బన్నీ వాసు మాట్లాడుతూ 'వినోదాత్మకంగా, ఉల్లాసంగా సాగే నలుగురు స్నేహితుల కథ ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. థియేటర్లకు వచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి' అన్నారు. 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే కంటెంట్‌తో వస్తున్నాం' అని విజయేందర్ ఎస్. అన్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

గద్దర్ ఫిల్మ్ అవార్డులను తక్షణమే నిలిపివేయాలి

గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆంధ్రా సినిమాలకు ఇవ్వవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామని, శుక్రవారం వాదనలు వినిపించబోతున్నామని వారు చెప్పారు. కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు.

-బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

సీనియర్ నిర్మాత మహేంద్ర కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. దర్శకుడు రవికుమార్ చౌదరి మరణించిన 24 గంటలు కాకముందే సీనియర్ నిర్మాత, ఎ.ఎ.ఆర్ట్స్ అధినేత కావూరి మహేంద్ర(79) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధమైన సమస్యలతో బాధపడుతున్న మహేంద్ర తన స్వస్థలమైన గుంటూరులోని రమేశ్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నటుడు, నిర్మాత మాదాల రవి ఆయనకు అల్లుడు. కుమారుడు జీతూ కొన్నేళ్ల క్రితమే మరణించారు. ప్రొడక్షన్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించిన మహేంద్ర తర్వాత నిర్మాణరంగంలోకి ప్రవేశించి గీతా ఆర్ట్ పిక్చర్స్, ఎ.ఎ. ఆర్ట్స్ బేనర్లపై 36 చిత్రాలు నిర్మించారు. 1977లో వచ్చిన 'ప్రేమించి పెళ్లి చేసుకో' నిర్మాతగా మహేంద్ర తొలి సినిమా. రాజశేఖర్ హీరోగా నటించిన 'అర్జున' ఆయన చివరి చిత్రం.

ఏడాదిలో 70 శాతం హామీల అమలు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో గుంటూరులోని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు నివాసంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జీవీ, మక్కెన మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని, 70శాతం హామీలు అమలు చేసి రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని అమలు చేస్తూ.. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామన్నారు. తల్లికి వందనం అమలు చేశామని, ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం, క్రమం తప్పకుండా పెన్షన్లు పంపిణీ, దీపం- 2 పథకం వంటి ప్రతి హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ పేటీఎం బ్యాచ్ విద్వేషాలు, విధ్వంసాలు సృష్టించేందుకు మహిళలపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విధ్వంసకారులను ప్రభుత్వం వదిలే ప్రసక్తే లేదని జీవీ హెచ్చరించారు. గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, చింతా శ్రీనివాసరావు, ముక్కుపాటి రవికుమార్ భైరపనేని శ్రీనివాసరావు, మారాసు రామయ్య, నలబోతు రామ కోటేశ్వరరావు, నర్రా రామకృష్ణ వానిరెడ్డి, రవిచంద్ర పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో.. పోలీసు విచారణకు అనుమతి

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు జంట హత్యల కేసులో నిందితులను విచారించేందుకు వెల్దుర్తి పోలీసులు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ ఈ నెల 16, 17 తేదీల్లో పోలీసు విచారణకు అనుమతినిచ్చారు. జంట హత్యల కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులు అరెస్టయి.. రిమాండ్‌లో ఉన్నారు. పోలీసుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

ఒంటరి మహిళ మెడలోని చైనే టార్గెట్

● నిందితుడి అరెస్ట్.. ● 128 గ్రాముల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ఇటీవల మహిళ మెడలో బంగారు చైను అపహరణకు పాల్పడ్డ యువకుడు షేక్ జానిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన వివరాలు వెల్లడించారు. గురజాలకు చెందిన షేక్ జాని దొంగతనాలకు అలవాటుపడి మాచర్ల పట్టణంలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిపారు. నాలుగు కేసుల్లో అతను నిందితుడని చెప్పారు. జానీ అపహరించిన 128 గ్రాముల బంగారం విలువ సుమారు రూ. 10.24 లక్షలు ఉంటుందని తెలిపారు. సొమ్ము రికవరీ చేసి, కోర్టులో హాజరుపరుచనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ సీఐ పి.ప్రభాకరరావు, ఎస్ఐలు వెంకటరమణ, సంధ్యారాణిని అభినందించారు.

నెలాఖరులోపు పసుపు రైతులకు పరిహారం

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన పసుపు రైతులకు ఈ నెలాఖరుకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఈ అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీకి న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ నుంచి ప్రమాద బీమా నగదు అందిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా పసుపు నిల్వచేసిన 294 మంది రైతులకు నగదు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇన్సూరెన్స్ కంపెనీకి అవసరమైన అన్ని డాక్యుమెంట్లు అందించడం జరిగిందన్నారు. వారంలోపు ప్రమాద బీమాను కంపెనీ మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. విజయవాడలోని మార్క్‌ఫెడ్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఒక బస్తా పసుపునకు రూ.7 వేల చొప్పున బాధిత రైతులకు పరిహారం అందించేందుకు వీలుగా అవసరమైన నగదు సమకూర్చుకోవాలని, బాధిత రైతులకు నష్టపరిహారం వివరాల స్లిప్పులను వెంటనే అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ బీమా పరిహారం నగదు జమ అయిన వెంటనే బాధిత రైతులకు పంపిణీ చేసేందుకు వీలుగా ఇప్పటికే జాయింట్ అకౌంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ సురేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు, మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకానికి దొంగ బిల్లులు పెట్టిన వైసీపీ

● ఆడిట్‌లో అడ్డంగా దొరికిన వైసీపీ నాయకులు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'దొంగ బిల్లులతో కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టి గత రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన రూ.250 కోట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. కేంద్ర పథకాలకు కొత్తగా నిధులు మంజూరు చేయాలంటే తప్పుడు పద్ధతుల్లో కాజేసిన ఆ నగదు కట్టాలని కేంద్రం చెబుతోంది.' అని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కార్యాలయంలో గురువారం జరిగిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల పాలనకు, కూటమి పాలనకు తేడా ప్రజలు గమనించాలని కోరారు. జగన్ పాలనలో అభివృద్ధి నిర్వీర్యం అయిందే తప్ప ఎక్కడా ప్రజా సంక్షేమం జరగలేదన్నారు. సంక్షేమం పేరుతో పొద్దునే డబ్బులు ఇచ్చి సాయంత్రానికి వసూలు చేసుకునే కార్యక్రమం తప్ప ఏమీ లేదని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం ద్వారా ముస్లిం మైనారిటీలకు సౌకర్యాలు కల్పించవచ్చని తెలిసి, దానిపై తాను విచారించగా.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకం బయట పడిందని పెమ్మసాని తెలిపారు. 2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనుల్లో 80 పనులు తాము పూర్తిచేశామని వైసీపీ ప్రభుత్వం బిల్లులు వసూలు చేసిందని పేర్కొన్నారు. ఆడిట్లో ఈ అవకతవకలు బయటపడ్డాయన్నారు. దీనిపై వైసీపీ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి వచ్చి ముస్లింలకు దక్కాల్సిన నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆరోపించారు. గడిచిన ఐదేళ్లలో బటన్ నొక్కుడు కార్యక్రమం కాకుండా ముస్లింలకు ఏం చేశారని ప్రశ్నించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పదేళ్ల నుంచి ఆగిపోయిన భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. దక్కన్ టొబాకో వారితో మాట్లాడి ఎమ్మెల్యే నసీర్ ఆర్థో ట్రామా వంటి ఎన్నో సౌకర్యాలు జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఏడాదిలో గుంటూరు నగరంలో అభివృద్ధిలో కూటమి మార్క్ స్పష్టంగా కనిపించిందన్నారు. ఏ మూలకు వెళ్లినా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, ఈ ఐదేళ్లలలో గుంటూరు తూర్పు స్వరూపమే మారిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాజా మాస్టారు, డిప్యూటీ మేయర్ సజీల, నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'కన్నప్ప' సెన్సార్ కాకముందే.. విడుదల తేదీ ప్రకటనా?

● మంత్రి సత్యకుమార్‌కు బ్రాహ్మణ చైతన్య వేదిక ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు అందజేస్తున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నేతలు

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కన్నప్ప సినిమా ఇంకా సెన్సార్ సర్టిఫికేట్ పొందకుండానే విడుదల తేదీని ప్రకటించడంపై బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ, ఏపీ అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి ఆక్షేపించారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. మంచు మోహన్ బాబు నిర్మించిన కన్నప్ప సినిమాలో సనాతన ధర్మాన్ని కించపరిచి, బ్రాహ్మణ ఆచార వ్యవహారాల్లో ఒక భాగమైన శిఖను పిలక గిలక అనే పాత్రలు సృష్టించి బ్రాహ్మణ సమాజాన్ని అవమానించారని పేర్కొన్నారు. హైకోర్టులో తాము రిట్ పిటిషన్ వేశామని, కేస్ పెండింగ్‌లో ఉండగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండానే తేదీ ప్రకటించారని ఇది ఎలా సాధ్యపడుతుందని శ్రీధర్ ప్రశ్నించారు. సనాతన ధర్మ పరిరక్షణకు విఘాతం కలిగించే కన్నప్ప సినిమాలోని సన్నివేశాలు తొలగించేలా ఫిలిం సెన్సార్ బోర్డు రీజనల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేయాలని శ్రీధర్ కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అందరి మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత సినిమా వారికి ఉందని, తాము బ్రాహ్మణ సమాజానికి అండగా ఉంటామన్నారు. కన్నప్ప సినిమా పైన చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. దర్శనపు శ్రీనివాస్, ఐలూరు శ్రీనివాస్, యనమదల ఆంజనేయులు, ఎండపల్లి శబరి, చిలుమూరు ఫణి, వేదాంతం లక్ష్మణ్ ఉన్నారు.

వృద్ధాప్యం.. అనారోగ్యం

బాపట్లలో అన్నదమ్ముల ఆత్మహత్య



బొడ్డుపల్లి వెంకట సుబ్బయ్యశాస్త్రి, బాల సుబ్రహ్మణ్యం(ఫైల్‌ఫొటో)

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆరుపదుల వయస్సుదాటింది. అవివాహితులైన సోదరులు గత కొంతకాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్నారు. చూసేవారు లేరు. దీంతో ఏమనుకున్నారో ఏమో ఇద్దరూ కలిసి తనువు చాలించారు. విషాదం ఏమిటంటే ఇంతకాలం వారి వెన్నంటి ఉన్న రెండు కుక్కలు కూడా మృతి చెందాయి. నాలుగైదు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాలు.. బాపట్లలోని శిఖరంవారి వీధిలో అన్నదమ్ములైన బొడ్డుపల్లి వెంకటసుబ్బయ్య శాస్త్రి(65), డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం(63) నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ పెళ్లి చేసుకోలేదు. వారు నివాసం ఉంటున్న ఇంటి నుంచి గురువారం సాయంత్రం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రాంబాబు సిబ్బందితో వచ్చి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో సోదరుల మృతదేహాలను గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితం వారిద్దరూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు తెలిపారు. ఆహారంలో ఏదైనా పురుగుల మందు కలుపుకు తిని ఉంటారని మృతదేహాల పరిస్థితిని బట్టి అనుమానిస్తున్నారు. ఆ సమీపంలోనే రెండు కుక్కలు కూడా చనిపోయి ఉన్నాయి. వారు తినిన ఆహార పదార్థాలను కుక్కలు కూడా తిని చనిపోయి ఉంటాయని పోలీసులు అనుమానం. ఈ ప్రాంతంలోనే బాలసుబ్రహ్మణ్యం సుదీర్ఘకాలం దంత వైద్యుడిగా సేవలందించారు. గత కొంతకాలంగా సోదరులు అనారోగ్యంతో బాధపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. గుంటూరులోని బంధువులకు సమాచారం ఇచ్చామని పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్

● పెమ్మసాని చొరవతో త్వరలో..

మంగళగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటరు అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎయిమ్స్ ఆసుపత్రిని పరిశీలించారు. ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటరు అవసరమని వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో జిల్లా వైద్యాధికారుల దృష్టికి మంత్రి పెమ్మసాని తీసుకువెళ్లారు. జిల్లా వైద్య శాఖ బృందం ఎయిమ్స్‌లో పరిశీలన జరిపి.. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన మంత్రి పెమ్మసాని ఎయిమ్స్‌లో కార్నియా మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. ఈ సౌకర్యంతో గుంటూరు జిల్లాతో పాటు మూడు జిల్లాల కంటి సమస్య బాధితులకు ఊరట లభించనుంది.

లారీ ఢీకొని.. వాహన చోదకుడి మృతి

తెనాలి, మారీసుపేట,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీ కొని వాహన చోదకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ ఎస్సై షేక్ కరిముల్లా వివరాల మేరకు.. మండలంలోని కోపల్లెకు చెందిన కారుమంచి దేవదానం (70) పట్టణంలో ఒక కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో సుల్తానాబాదులో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవదానం ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరిముల్లా తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవ సమాజానికి మేలు



పొన్నూరుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందని, ఏడాది పాలనతో అది రుజువైందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ మోసిగంటి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25 శాతం ఉన్న క్రైస్తవుల సమాజానికి కూటమి ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని కొనియాడారు. జగన్‌రెడ్డి తమ వాడు అనుకుని 98 శాతం మంది క్రైస్తవులు సహకరించి, గెలిపిస్తే క్రైస్తవులను వంచించారని ఆరోపించారు. జగన్‌రెడ్డి పాస్టర్‌ల వివాహ లైసెన్స్‌ల జారీ కాలాన్ని మూడేళ్లకు కుదిస్తే కూటమి ప్రభుత్వం పదేళ్లకు కొనసాగించిందన్నారు. 12 వేల ఎయిడెడ్ స్కూల్స్‌ను గత ప్రభుత్వం మూసి వేస్తే.. మంత్రి లోకేష్ దానిపై విచారణ జరుపుతున్నారన్నారు. క్రిస్మస్ పండుగను ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రతి జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. టీడీపీ కార్యాలయంలో ఏటా క్రిస్మస్ పండుగను నిర్వహిస్తారని వైసీపీ కార్యాలయంలో ఎందుకు జరపరని ప్రశ్నించారు. క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల సేకరణ కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అర్చకులు, ఇమామ్‌లతో పాటు పాస్టర్‌లకు రూ.30 కోట్లు గౌరవ వేతనాలు ఇచ్చారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చర్చిల మరమ్మతులకు నిధులు కానీ, క్రైస్తవుల ఉపాధి కోసం నబీడీ రుణాలు కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదన్నారు. విద్యావంతులైన వారికి ఛైర్మన్, అడ్వైజరీ పదవులు ఇవ్వడం ద్వారా క్రైస్తవులకు మరింత మేలు జరుగుతుందని జోసెఫ్ మోసిగంటి ప్రభుత్వాన్ని కోరారు.

పరిశీలనకు వచ్చి..రూ.15 లక్షలు ఇచ్చారు



పరిశీలిస్తున్న డాక్టర్ అమర్నాథ్

గుంటూరు (మెడికల్)జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేశం దాటి వెళ్లినా చదువుకున్న కళాశాలను, అనుభవాన్ని పంచిన ఆసుపత్రిని మరువలేదు డాక్టర్ కొమ్మూరి అమర్నాథ్. బాపట్లకు చెందిన ఆయన 1997లో గుంటూరు మెడికల్ కాలేజ్‌లో డాక్టర్ పట్టా పొందారు. ప్రస్తుతం అమెరికాలో కార్డియాలజిస్ట్‌గా స్థిరపడ్డారు. గురువారం జీజీహెచ్‌ను సందర్శించిన డాక్టర్ అమర్నాథ్ కొన్ని విభాగాలను పరిశీలించారు. ఫిజియాలజీ విభాగంలో సమస్యలను సిబ్బంది చెప్పడం తో మరమ్మతుల నిమిత్తం రూ.15 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. డాక్టర్ అమర్నాథ్ స్పందనపై జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ హర్షం వ్యక్తం చేశారు.

కట్టుకోమన్నా.. కదలరు

(3వ పేజీ తరువాయి)

పొందారు. పల్నాడు జిల్లాలో 14,106మందికి రూ.75.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. బాపట్ల జిల్లాలో 13,178 మందికి అదనపు సహాయాన్ని కేటాయించారు. ప్రభుత్వం అదనపు సహాయం ప్రకటించి ఇప్పటికి 3 నెలలు అవుతున్నా 2,600 మంది మాత్రమే తొలివిడత సహాయం పొందారు. కాగా వారిలో 300 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టారు.

సహాయం ఇస్తున్నా స్పందన కరువు

గత ముఖ్యమంత్రి పేదలకు ఇళ్లు కట్టిస్తానని చెప్పి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎంఏవై, ఇతర స్కీముల ద్వారా వచ్చే రూ.1.80 లక్షలు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇచ్చింది లేదు. ఆ నగదు ఇళ్లు కట్టుకునేందుకు సరిపోక అప్పులు తెచ్చుకుని నిర్మాణం కొనసాగించారు. అవీ చాలక చివరికి ఇళ్ల నిర్మాణం ఆపేసుకున్నారు. అలాంటి వారి కోసం ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించింది. కానీ పనులు పూర్తి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

మౌలిక సదుపాయాల లేమే కారణమా?

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు ఇచ్చింది. అలా ఇచ్చిన స్థలాల్లో మెజారిటీ స్థలాలు జనావాసాలకు దూరంగా, లోతట్టు ప్రాంతాల్లో ఇచ్చింది. దీంతో అక్కడ మౌలిక సదుపాయాల సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలం వస్తే మోకాలి లోతు బురదలో కాలనీలు కూరుకుపోతున్నాయి. అడుగు తీసి అడుగు వేయడమే దుర్భరంగా మారిపోతోంది. దీంతో చాలామంది ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు సుముఖంగా లేరు.

పంచాయతీల్లో.. పైసలు లేవు

(3వ పేజీ తరువాయి)

విడుదల చేసింది. పల్నాడు జిల్లాకు రూ.30.78 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23.35 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ.16.39 కోట్లు పంచాయతీల బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉన్నా ఆ ఊసే మరిచింది.

నిధులు విడుదలతోనే వెసులుబాటు

వర్షాకాలం మొదలైంది. అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న హెచ్చరికలున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నిధులు లేక ఎటువంటి పనులు చేయలని పరిస్థితుల్లో పంచాయతీ పాలక వర్గాలు ఉన్నాయి. నిధులు విడుదల చేస్తే ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు వంటి పనులకు వెసులుబాటు ఉంటుందని సర్పంచ్‌లు తెలుపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

46,207 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 44,402 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,207 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,136 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	12500	334	9500	13600
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	-----
4884	---	---	341	10000	14000
సూపర్ 10	---	---	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14300	తేజ	10000	14500
షార్క్-1	-----	------	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ధ్యానంతో ఆందోళన, ఒత్తిడి తగ్గుతుంది

● మాస్టర్ శ్రీనివాసరెడ్డి

కర్లపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ ధ్యానంతో ఆందోళన, ఒత్తిడి తగ్గి శక్తి పెంపొందుతుందని ధ్యాన మాస్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కర్లపాలెం గణపవరంరోడ్డులోని గురువాణి ధ్యాన కేంద్రంలో ఏరువాక పౌర్ణమి ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానులు ఆలపాటి రాజేశ్వరి ఆత్మశక్తికి శాంతి కలగాలని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మనస్సు మనస్సు ఆత్మ మధ్య అనుసంధానం పెంచుకొని ఆధ్యాత్మిక అనుభవాలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కూనం చంద్రశేఖర్, లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం

పిట్టలవానిపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గురువారం బడి గంటలు మోగాయి. పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 కె.రాజారత్నం, మండలంలోని ఖాజీపాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందజేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనానికి సంబంధించిన సన్నబియ్యాన్ని ఎంఈవో-2 కె.రాజారత్నం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేముల భూపతిరావులు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఎం మునలయ్య, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వేమూరు ఎంపీడీవోగా రవికుమార్



ఎంపీడీవో రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న మండల పరిషత్ ఉద్యోగులు

వేమూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేమూరు ఎంపీడీవోగా పి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వేమూరులో పనిచేస్తున్న శివన్నారాయణ చీరాలకు బదిలీ కావడంతో దాచేపల్లిలో పనిచేస్తున్న రవికుమార్‌ను వేమూరు మండలానికి నియమించారు. ఆయనకు మండలపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధ, ఈవోపీఆర్డీ డి.శేఖర్, సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది స్వాగతం పలికారు.

ఘనంగా శ్రీబండ్లమ్మ కొలుపులు

పిట్టలవానిపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెంలో ఉన్న శ్రీబండ్లమ్మవారి కొలుపుల మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం 7గంటలకు అమ్మవారి మేలుకొల్పి అమ్మవారి ఘటం, పావ నం, వీరతాళ్ళు, సేవకత్తులు, పోతురాజు ముద్రగడతో ఊరేగింపుగా గ్రామం తిరుగుతూ అమ్మవారికి చద్ది నైవేద్య కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలు నుంచి ఊరిబయట మద్దెనలమ్మ, మదారు సాహెబ్‌లకు రొట్టెలు, చుట్టలు సమర్పించినట్లు గ్రామపెద్దలు తెలిపారు. రాత్రి 9గంటలు నుంచి మారి, ముత్యాలమ్మ క్రతువు కార్యక్రమాలను నిర్వహించి మొక్కుబడులను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ



విద్యార్థినికి విద్యా మిత్ర కిట్లు అందజేస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

వేమూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజునే మం డల పరిధిలోని 40ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం వేమూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ 17 గ్రామాల పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలు రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 32 ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు రికార్డుల్లో నమోదైన 1947 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారన్నారు. ప్రతి విద్యార్థికి యూనిఫామ్, టెస్ట్‌బుక్స్, నోట్ బుక్స్, బూట్లు, బెల్టు ఇచ్చారన్నారు. పదో తరగతికి సంబంధించిన సిలబస్ మారినప్పటికీ అన్ని టెస్ట్‌బుక్స్ ముందుగానే సరఫరా అయినట్లు తెలిపారు. బ్యాగులు సరఫరా కాలేదని రెండు మూడు రోజుల్లో అందిన వెంటనే వాటిని కూడా విద్యార్థులకు అందించామన్నారు.

అంగన్‌వాడీకేంద్రాలను బలోపేతం చేయాలి



పిల్లలకు తల్లిదండ్రులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం కాటూరి నాగేశ్వరరావు

చెరుకుపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆరేపల్లి గ్రామంలో గురువారం మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం బాగుంటేనే ఆ గ్రామంలో పిల్లల భవిష్యత్తు బాగుంటుందని హెచ్‌ఎం కాటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ జూన్ 6వతేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి నిర్ణయం ప్రజాహితం.. ప్రజాపాలనకు ఏడాది

● నైతిక విలువలకు కట్టుబడి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పాలన

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రతి నిర్ణయం ప్రజాహితం కోరుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ప్రజాపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం బాపట్ల టీడీపీ కార్యాలయంలో సంబరాలు చేశారు. తొలుత పార్టీశ్రేణులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నైతిక విలువలకు కట్టుబడి ప్రజల విశ్వాసాన్ని నిలబట్టే పాలన కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 254మందికి రూ.2కోట్ల 45లక్షలు పార్టీలకు అతీతంగా అందించారన్నారు. దీపం పథకం కింద 47,739 మందికి రూ.4కోట్ల 16లక్షలు లబ్ధిచేకూర్చామన్నారు. 1441 మంది మత్స్యకారులకు రూ. 2కోట్ల88లక్షలు భరోసానిచ్చారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 37మందికి రూ.74లక్షల బ్యాంకు రుణాలు ఇప్పించామన్నారు. కాపు మహిళలు 579మందికి రూ.కోటి 44లక్షల విలువ చేసే కుట్టుమిషన్లు ఆగస్టు 15వ తేదీన అందిస్తామన్నారు. వెదుళ్ళప ల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల మరమ్మతులకు రూ. 16లక్షలు కేటాయించామన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద 15,870 మందికి 3కోట్ల రూ.17లక్షలు ఇచ్చారన్నారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన 12,880 మంది రైతులకు 4కోట్ల 35లక్షల రూపాయలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు 50శాతం సబ్సిడీ కింద 144 మందికి 23లక్షల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. 100 పడకల ఏరియా వైద్యశాలను 300 పడకలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. పంచాయతీ రాజ్‌శాఖలో 86 సీసీరోడ్లను రూ.9కోట్ల 32లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నల్లమడ డ్రైన్‌పై 14కోట్ల 10లక్షల రూపాయలతో హైలెవెల బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పిట్టవానిపాలెం తుంగభద్రపై రూ. 9కోట్ల 13లక్షలతో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇవి కాకుండా డ్రైనేజి, ఇరిగేషన్, గ్రామీణ నీటిపారుదల, దేవదాయశాఖ, విద్యాశాఖల్లో పెద్దఎత్తున నిదులు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూడి బంగారుబాబు, మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, పట్టణ, మండల అధ్యక్షులు గొలపలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత, మున్సిపల్ మాజీ చైర్మన్ జిట్టా ప్రమీలారాణి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ జీవన్, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, జి.గిరిజారాణి, సీనియర్ నాయకులు అల్లంగోపి కృష్ణ, మందపాటి ఆంద్రేయ, బుర్లె రామసుబ్బారావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, రమేష్ కుమార్, పరీద్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

● ఏపీస్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం ఎంసీ రాజమోహన్

● ఘనంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జనరల్ మేనేజర్ రాజమోహన్, వైస్‌చాన్స్‌లర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి తదితరులు

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు వివిధ రాష్ట్రాలలోని రీసెర్చ్‌సెంటర్‌లను సందర్శించి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఏపీస్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎంసీ రాజమోహన్ తెలిపారు. దీనివలన ఉద్యోగవకాశాలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి కాలేజీ, హాస్టల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆర్ శారదా జయలక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ జరిగిన సభలో రాజమోహన్ మాట్లాడుతూ మధ్యప్రదేశ్, హరియాణ, అస్సాం, ఏపిలోని గార్లదిన్నెలో ఉన్న మిషనరీ ట్రైనింగ్ సెంటర్‌లను సందర్శించాలన్నారు. ఈ స్టేషన్‌లలో 6నెలలపాటు అప్రంటీస్‌కు ఆసక్తి ఉన్న విద్యార్థులు జాయిన్ అయితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు కూడా మంచి నడవడితో ఉంటారన్నారు. భారతదేశానికి ఆధునిక యంత్రపరికరాలను తయారు చేసేవిధంగా ఎదుగుతారని ఆయన విద్యార్థులను ఉత్తేజపరుస్తూ మాట్లాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీన్‌ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి ఎ.మణి, డీన్ ఆఫ్ స్టూడెంట ఎఫైర్స్ జి.కరుణసాగర్, ఏవీ రమణ, కళాశాల అసోసియేట్ డీన్ డీడీ స్మిత్, ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాఠశాలలు, వసతిగృహాలకు సన్నబియ్యం సరఫరా



సన్నబియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు నాణ్యమైన ఫోర్టిఫైడ్ సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు సరఫరా చేసిన సన్నబియ్యాన్ని గురువారం ఆయన డీఎస్‌వో షేక్ జమీర్‌బాషా, ఎంఈవో ఎస్ నిరంజన్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 50కిలోల గన్నీ బ్యాగ్‌ల్లో బియ్యం ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం సూపర్‌ఫైన్ బియ్యాన్ని 25కిలోల బ్యాగ్‌లలో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1415 పాఠశాలలకు ప్రతినెల 6,620 బ్యాగ్‌లు అందజేస్తున్నామన్నారు. 79 వసతి గృహాలకు 2,818బ్యాగ్‌లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని పాఠశాలల ప్రారంభం రోజునే పంపిణీ చేసి విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖాధికారులు నాగమల్లేశ్వరి, అంజనేయులునాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ శాఖలకు కేంద్రసాయం


● వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఈడీ శోభామణి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శోభామణి

వేమూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వికసిత కృషి సంకల్ప అభియాన్ ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖలకు అనేక పథకాలను ప్రవేశపెట్టామని శాస్త్రీయ బృందాల ద్వారా వాటిని అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామని శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ బి.శోభామణి పేర్కొన్నారు. గురువారం వేమూరు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుల కార్యాలయ భవనంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ ముగింపు సందర్భంగా సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ శోభామణి మాట్లాడుతూ మే 29 నుంచి జూన్ 12 వరకు ఈ కార్యక్రమాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కృషి విజ్ఞానకేంద్రం లాంఫామ్ గుంటూరు వారి పర్యవేక్షణలో మూడు ప్రత్యేక టీంల ద్వారా నిర్వహించామన్నారు. ప్రధానంగా వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటి ద్వారా పేద కుటుంబాల ఆర్థిక పరిపుష్టిని పెంపొందించేందుకు కొన్ని శాఖల్లో పనిచేసే వారికి అవగాహన కల్పిస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి ఎం యుగంధర్‌కుమార్ మాట్లాడుతూ రైతులు నాటుకోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం ప్రాధాన్యంపై అవగాహన కలిగి ఉంటే వాటి ద్వారా ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉందన్నా రు. మరో శాస్త్రవేత్త ఎస్ శివశంకర్, ఏడీఏ షేక్ హుస్సేన్, పశు సంవర్ధక శాఖ ఏడీ జనార్ధనరావులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ అనీల్ కుమార్, ఏపీఎం శోభన్, రైతు భరోసా కేంద్రాల అసిస్టెంట్లు, యానిమేటర్లు, డ్వాక్రా గ్రూపుల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆప్తమిత్ర సేవలు అభినందనీయం



విద్యార్థులకు బహుమతులు అందించిన ఆప్తమిత్ర సభ్యులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

రేపల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆప్తమిత్ర స్వచ్ఛంద సంస్థ గత దశాబ్దకాలంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులను అందించి వారిని ఆర్థికంగా ఆదుకోవటం అభి నందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆప్తమిత్ర స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన 10వతరగతి పరీక్షల్లో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వివిధ పాఠశాలలకు చెందిన 10వతరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ.10వేలు చొప్పున బహుమతులు అందించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనగాని శివప్రసాద్, జీపీ రామారావు, ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, ఆప్త మిత్ర సభ్యులు రాగంమాధవి, కె.గిరిధర్, ఆకుల సాయిరామ్, రవి కిషోర్, వాకా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నిర్బంధించిన వ్యాపారి

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకాన్ని కట్టడి చేయటంలో భాగంగా షాపులో తనిఖీల కోసం వెళ్లిన శానిటరీ ఇన్స్పెక్టర్‌నే బంధించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సీహెచ్ కరుణ పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీలో తనిఖీ నిమిత్తం వెళ్ళగా సదరు వ్యాపారులు ఆమెను షాపులో పెట్టి డోర్ మూసి బంధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి షాపు దగ్గరకొచ్చి వ్యాపారులను హెచ్చరించి ఆమెను విడిపించారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ చర్యలకు ఉపక్రమించారు. దీనిపై సదరు షాపును సీజ్ చేస్తామని కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. బాపట్ల పట్టణంలో నానాటికీ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు, గ్లాసుల విక్రయాలు పెరిగిపోతున్నాయి. అధికారులు దాడులు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వ్యాపారులు విక్రయించటం ఆపటంలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే తయారీ చేసే కంపెనీలను మూసివేయించండని బదులిస్తున్నారు. ఇప్పటికే సదరు దుకాణంలో మార్చి 11వ తేదిన ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకొని 2 వేల రూపాయలు జరిమానా విధించారు. ఆ తర్వాత మే19వ తేదీన దాడులు నిర్వహించి ప్లాస్టిక్ స్వాధీనం చేసుకొని 10వేల రూపాయలు జరిమానా విధించారు. అయినప్పటికి షాపు నిర్వాహకులు జరిమానా చెల్లిచకపోగా తనిఖీకి వెళ్ళిన శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను బంధించటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. గురువారం శానిటరి ఇన్‌స్పెక్టర్ కరుణ, షేక్ నజీర్ సిబ్బందితో కలిసి వెళ్లి శ్రీహరికి సంబంధించిన గోదాములో తనిఖీ చేయగా 2 మెట్రిక్ టన్నుల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకొని మున్సిపల్ కార్యాలయంలో కంప్యాక్టర్ ద్వారా ధ్వంసం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు పెద్దఎత్తున ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. మొదటిసారి రెండు మెట్రిక్‌టన్నులు, రెండోసారి ఒక టన్ను, మూడోసారి 1.5 టన్నులు తాజాగా రెండు టన్నులు స్వాధీనం చేసుకున్నారు.

కూటమి నేతల సంబరాలు




కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మురళీకృష్ణ, కూటమి శ్రేణులు

కొల్లూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా టీడీపీ మండల కార్యాలయంలో గురువారం మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా తల్లికి వందనం పథకం అమలుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, టీడీపీ నాయకులు పబ్బిసెట్టి సత్యకుమార్, కోగంటి హరిబాబు, పోతార్లంక కుటుంబరావు, గోరికపూడి ప్రసాద్, కాసరనేని మోహన్, బుర్రి జగన్, గాదె చంటి తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అమృతలూరులోని పార్టీ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్యావర్రు డీసీ కొరటాల లీలసత్యసాయి, మట్లపూడి జయపాల్‌లు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బొంతా ఆంజనేయులు, క్రొత్తపల్లి రవీంద్రబాబు, అచ్చన వెంకటే శ్వరరావు, నార్లశీను, పాములపాటి వెంకటసుబ్బారావు, మ్యాథ్యూస్, ఐమళ్ళ ప్రమోద్, జేమ్స్, జాన్సీ బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌కు సత్కారం



వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిషోర్‌కుమార్‌ను సత్కరిస్తున్న అమృతలూరు మండల టీడీపీ నాయకులు

వేమూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన అమ్మిశెట్టి కిషోర్‌కుమార్‌ను గురువారం అమృతలూరు మండల టీడీపీ నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. తెనాలిలోని కిషోర్‌కుమార్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు శరణుగిరి రాజేంద్రప్రసాద్, యలవర్తి బ్రహ్మానందం, జగన్మోహనరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యార్డు డైరెక్టర్‌ను సన్మానించిన నాయకులు

అమృతలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన మొవ్వా శ్రీనివాసరావు పార్టీ నాయకులు సన్మానించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావును పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

ఆశా నోడల్ ఆఫీసర్స్‌కు కిల్కారి సేవలపై శిక్షణ

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆశా నోడల్ ఆఫీసర్లకు కిల్కారి సేవలపై శిక్షణ, సమీక్ష జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కిల్కారి ప్రోగ్రామ్‌ను గర్భిణులు, బాలింతల కోసం ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీపీవో లలిత రాజేశ్వరి, డీపీవో ప్రేమపావని తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

● అనగాని శివప్రసాద్



అరవపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం కూటమి కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు నిర్మించారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని బేతపూడి, ఉప్పూడి, అరవపల్లి, నెల్లూరువారిపాలెం, పెద్దఅరవపల్లి గ్రామాల్లో రహదారులకు శంకుస్థాపన, పూర్తయిన రహదారుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో బేతపూడినుండి రావి అనంతవరం వరకు నాబార్డు నిధులతో రూ.2కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. మోర్లవారిపాలెం పేటేరు రోడ్డు టీఎస్‌ఎఫ్‌టీ రూ.80లక్షల నిధులతో సీసీ రహదారుల అభివృద్ధి కోసం రూ.25లక్షలు, ఉప్పూడి గ్రామం నుంచి నెల్లూరుపాలెంలో ఎంజీఎన్ ఆర్‌ఎస్ గ్రాంట్లు ద్వారా రూ.15లక్షలు, పెద్దఅరవపల్లిలో రూ.14లక్షలతో రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. చిన్నఅరవపల్లిలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నాయకులు మత్తిభాస్కరరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల సంబరాలు



కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు

రేపల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అన్నారు. గురువారం కూటమి అధికారం చేపట్టి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నాడు విధ్వంసపాలనను తరిమికొట్టి నేడు ప్రజాహిత పాలనకు సంవత్సరమైందని ఆయన అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో నియోజకవర్గంలో అన్నిశాఖలు అన్ని గ్రామాల అభివృద్ధి కోసం రూ.400కోట్లు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, గోగినేని పట్టాభి రామారావు, కొమ్మూరువెంకటేష్, ఎన్‌వీకే ప్రసాద్, దండుప్రోలు వెంకటేశ్వరరావు, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, జనసేనపార్టీ నాయకులు మత్తి భాస్కరరావు, ఆర్.మహేష్, బీజేపీ నాయకులు మాణిక్యారావు, పొన్నూరి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి కొలువు తీరి సంవత్సరమైన సందర్భంగా చెరుకుపల్లిలో కూటమి నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ మాట్లాడుతూ ఈరోజు అంధకారంలోకి వెళ్లిపోయిన రాష్ట్రానికి సుపరిపాలన అందించడానికి కూటమి కొలువుతీరిన రోజన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాధాకృష్ణమూర్తి, దివిరాంబాబు, పొన్నపల్లి సత్యనారాయణ, ధూళ్ళ సురేష్, ఈవూరి దుర్గాప్రసాద్, విస్సంశెట్టి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టుల సముదాయాన్ని పరిశీలించిన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల కోర్టుల సముదాయాన్ని గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ చక్రవర్తి గురువారం సందర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పాతకోర్టుపైన ఒకఫ్లోర్ నిర్మించాలని అందులో జిల్లా కోర్టు, నూతన బార్ రూమ్స్, టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. జడ్జిక్వార్టర్స్ నందు జిల్లా జడ్జి బంగ్లా నిర్మించాలని కోరారు. నూతనంగా జిల్లా కోర్టుల సముదాయం కోసం సూర్యలంక రోడ్డులోని పాతకోర్టు భవనాలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో 6వ డిస్ట్రిక్ జడ్జి కె.శ్యాంబాబు, ప్రిన్సిపల్ సబ్ జడ్జి జి.వాణి, ఏడీఎం రేణుకాలత, తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, పట్టణ సీఐ ఆర్ రాంబాబు, న్యాయవాదులు విన్నకోట సత్యప్రసాద్, ఏపీపీ గవిని శ్రీనివాస్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కోసూరి లక్ష్మీనారాయణ, డి.కిషోర్, నాగలక్ష్మీ, కంచర్ల రవి, విజయ్‌కుమార్, సాంబశివరావు, తదితరులున్నారు.

బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, విద్యార్థులు

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి పనివద్దు - బడిముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. బాపట్ల జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా రూపొందించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీపీవో పురుషోత్తం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీవోఎన్‌బీసీ కృష్ణ, సిఫార్డ్ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, మర్రిపల్లి నాగరాజు, రాము, హైస్కూల్ పీడీ కత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్య అభివృద్ధికి కూటమి కృషి

అమృతలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్య అభివృద్ధికి కూటమి కృషి చేస్తుందని వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి భానుగంగాధర్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆమె విద్యార్థులకు అందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంను చైర్‌పర్సన్ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఎంఈవో-2 రమేష్‌బాబు, చైర్మన్ వినయ్‌బాబు, హెచ్‌ఎం నిరంజన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ


శివాలయంలో పూజలలో పాల్గొన్న తహసీల్దార్ రవి నాయక్

అంగరంగ వైభవంగా పార్వతీమల్లేశ్వర స్వామి కల్యాణం

బల్లికురవ. జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో గురువారం పార్వతీమల్లేశ్వర స్వామి దేవాలయంలో శివ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవాలయ వార్షికవేడుకలలో భాగంగా కల్యాణం నిర్వహించారు. దేవాలయ పూజారి పేటేటి లక్ష్మయ్య ఈసందర్భంగా పార్వతీమల్లేశ్వర స్వామి వారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. ఆనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తదుపరి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బల్లికురవ తహసీల్దార్ రవి నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌లు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.


విద్యుత్ ఉప కేంద్రానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

పంగులూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాల మధ్య విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. గ్రామాలలో లో ఓల్టేజ్ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రెండు గ్రామాల మధ్య 33 బై 11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని డీఈ దామోదర్ తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ సహకారంతో మంజూరయిన ఈఉప కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామని డీఈ తెలిపారు. మండల తహసీల్దార్ సింగారావుతో కలసి సర్వే నెంబరు 299లో స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్, మండల సర్వేయర్ బండి సురేష్, వీఆర్వో సుధాకర్, సర్వేయర్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.


పూనూరులో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో సీడీపీవో సుభద్రతో టీడీపీ నాయకులు

పిల్లలను బడికి పంపించాలి


యద్దనపూడి,(మార్టూరు)జూన్12 (ఆంధ్రజ్యోతి):పిల్లలను బడికి పంపించడం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని ఐసీడీఎస్ పర్చూరు సీడీపీవో సుభద్ర అన్నారు. గురువారం యద్దనపూడి మండలంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ నాయకులు బోయపాటి సాంబ శి వరావుజి ప్రభాకరరావు,వి. వెంకటేశ్వరరావు తదితరులతో చిన్న పిల్లలను ఒడిలో కూర్చొబెట్టుకుని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అంగనవాడీ సూపర్ వైజరు సుజాత, కార్యకర్తలు రత్నకుమారి,కోటేశ్వరమ్మ,వసంతలక్ష్మి,రమాదేవి,నవమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా మార్టూరు మండలంలో ద్రోణాదుల గ్రామంలో సూపర్ వైజరు పద్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో సీడీపీవో పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంటేల శ్రీను పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతో సుఖ శాంతులు

చీరాలలో ఘనంగా కూటమి ప్రభుత్వం ఏడాది వేడుకలు

పొదుపు సంఘాల మహిళలకు రూ. 3.78 కోట్ల చెక్కుల పంపిణీ

ఎనిమిది ఆటోలు, మునిసిపల్ కార్మికులకు యూనిఫామ్ అందజేత


పొదుపు సంఘాల మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని, అభివృద్ధే పరమావధిగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్‌మహేంద్రనాధ్‌తో కలిసి గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలకు రూ.3.78కోట్లు రుణానికి సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. అలాగే ఎనిమిది ఎలక్ట్రికల్ ఆటోలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్‌లు గోపీకృష్ణ, పార్వతి, మునిసిపల్ కమిషనర్ రషీద్, డీఈ రఘురామ్, తదితర కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పర్చూరులో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కూటమి నేతలు

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

శిలాఫలాలను ప్రారంభించిన కూటమి నేతలు

పర్చూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం ప్రజా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పలువురు కూటమి నేతలు అన్నారు. పర్చూరులో రూ.4.87 కోట్లతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్ల శిలాఫలకాలను తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షులు షేక్.షంషుద్దీన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న నేపథ్యంలో స్థానిక బొమ్మల సెంటర్‌లో నేతలు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్, పీఆర్ డీఈ ఆదినారాయణ, జేఈ శ్రీనివాసరావు, ఈవో ఆర్డీ కొసనా సత్యనారాయణ, కార్యదర్శి మస్తాన్‌రావు, నాయకులు కొల్లా శివరాంప్రసాద్, తంగెళ్ల మల్లిఖార్జునరావు, తులసి శ్రీనివాసరావు, పఠాన్ సమీర్, విన్నకోట సతీష్, శ్రీరాం వెంకటసుబ్బారావు, షేక్.ఖాజావలి, జగదీష్, షేక్.సైదా, చిన్నోడు, కొరిటాల సురేష్, హైటెక్ సుభానీ, దరియా, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.


మార్టూరు పార్టీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లులో..

ఇంకొల్లు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసింది కూటమి ప్రభుత్వమేనని ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు అన్నారు.కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంకొల్లు టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశారు. నాయుడు హనుమంతరావు, మార్క్, పాలేరు రామకృష్ణ, కరి శ్రీను,పంగులూరి హనుమయ్య, అనంతలక్ష్మి, నాగేంద్రం, రమేష్, వెంకట్రావు, కరి వీరాంజనేయులు పాల్గొన్నారు.


ఇంకొల్లులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మార్టూరులో టీడీపీ నేతల సంబరాలు

మార్టూరు, జూన్12 (ఆంధ్రజ్యోతి): పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు ఏడాది పాలన పూర్తి చేసుకోవడంపై మండల టీడీపీ నాయకులు గురువారం సాయంత్రం మార్టూరులోని పార్టీ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు తొలుత స్వర్గీయ ఎన్‌టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.తరువాత కేక్ ను కట్ చేశారు.ఈ కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, కాకోలు వెంకటేశ్వర్లు, అడుసుమల్లి శ్రీనివాసరావు,తేలప్రోలు సాంబశివరావు,జాష్టి సాంబశివరావు, జంపని శ్రీను, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సజ్జాపురంలో రహదారి ప్రారంభం

సంతమాగులూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రహదారిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటి వరకు రూ. 20 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించామన్నారు. అలాగే సాగర్ మేజర్, మైనర్ కాలువలు రిపేర్ల కింద రూ. 31లక్షల నిధులు మంజూరు చేశానని తెలిపారు. సూపర్ సిక్స్‌లో భాగంగా పథకాలాన్ని ప్రజలకు అందేలా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సంతమాగులూరు కార్యాలయంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన ఏఎంసీ ఛైర్మన్ రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్యకు నిలయాలుగా మారాలని, పిల్లల విద్య, వారి పోషణకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. సీడీపీవో డి.సుధ మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు దోహదపడతాయని అన్నారు.కార్యక్రమంలో సంతమాగులూరు మండలం ఎమ్మార్వో రవి బాబు ,ఎంఈవో కోటేశ్వరరావు, ఏపీఎం హనుమంతరావు , బాపట్ల జిల్లా టీడీపీ మహిళా నాయకురాలు సుజాత, ఎంపీపీ యలమంద హాజరయ్యారు.


రహదారి ప్రారంభం
శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి, నేతలు

బాల్యం నుంచే సన్మార్గం వైపు అడుగులు

వేటపాలెం(చీరాల), జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే సన్మార్గంలో అడుగులు వేయడం వలన ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఝాన్సీ అన్నారు. గురువారం వేటపాలెం పట్టభద్రులు సంఘం ఆధ్వర్యంలో జీవీకేసీఎం ఫర్ సేవా కేంద్రంలో 30 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ పుష్పవల్లి, రిటైర్డ్ ఆర్‌జేడీ ప్రయాగరావు, ప్రతి వెంకట సుబ్బారావు, బట్ట మోహన్‌రావు, నాగాంజనేయులు, జ్యోతి, శరత్‌బాబు, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ బడిలో పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో సులోచనారాణి పేర్కొన్నారు.మండలంలోని దుద్దుకూరు అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం సామూహిక అక్షరాభాసం నిర్వహించారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

అద్దంకి,జూన్12(ఆంధ్రజ్యోతి): ఫిట్స్‌తో ఇంటి ముందు పడిపోయిన బాలుడు అంగలకుర్తి చరణ్‌ఆదిత్య(3) ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చెర్వుకొమ్ముపాలెంకు చెందిన చరణ్ ఆదిత్య ఈ నెల 10 వతేదీ ఇంటి ముందు ఫిట్స్‌తో పడిపోయాడు. అద్దంకిలోని ప్రయివేట్ వైద్యశాలకు తరలించి అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.


వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న ఉత్తమ రైతు లక్ష్మీనారాయణ

లక్ష్మీనారాయణకు ఉత్తమ రైతు పురస్కార్

తిమిడితపాడు/పర్చూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :ఉత్తమ రైతు పురస్కార్ అవార్డుకు కారంచేడు మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన బోడావుల లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. గురువారం లాం ఫామ్‌లో జరిగిన ఆచార్య ఎన్‌జీ రంగా 62వ ఫౌండేషన్ డే సందర్భంగా నిర్వహించిన అవార్డుల పురస్కార కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయ కమిషనర్ డిల్లీరావు, వీసీ శారదాజయలక్ష్మి, డీఆర్‌పీవీ సత్యన్నారాయణ, డీన్‌ఆఫ్ అగ్రికల్చర్, ప్రసాద్, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

టీచర్‌ను పాఠశాలలోకి అనుమతించని యాజమాన్యం

● పాఠశాల యాజమాన్యంపై ఏపీ టీచర్స్ గిల్డ్ ఫిర్యాదు


పాఠశాల బయట వేచిఉన్న తెలుగు టీచర్ పద్మావతమ్మ

చెరుకూరు(పర్చూరు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి) పాఠశాలలోకి ఉపాధ్యాయురాలిని అనుమతించకపోవటంతో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదు చేసింది. పర్చూరు మండలం చెరుకూరు ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్సి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు పండిట్ కె.పద్మావతమ్మను గురువారం పాఠశాల పునఃప్రారంభం రోజు అనుమతించలేదు. దీంతో ఆర్జేడీ బి.లింగేశ్వర్ రెడ్డి, బాపట్ల డీఈవో పురుషోత్తంకు ఫిర్యాదు చేశారు. యాజమాన్యం గత 17 నెలల నుంచి వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నట్లు వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.


అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డులో ఎన్‌టీఆర్ నగర్‌గా ఏర్పాటు చేసిన బోర్డు

నామ్ రోడ్డులో నేమ్ బోర్డు ఏర్పాటులో తికమక

● స్థానికుల అభ్యంతరం

అద్దంకి,జూన్12(ఆంధ్రజ్యోతి): ఆయా ప్రాంతాలను సులువుగా గుర్తించేందుకు రోడ్ల వెంబడి ఆయా గ్రామాలు, ప్రాంతాల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. అయితే నామ్ రోడ్డులో అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం వద్ద ఎన్‌టీఆర్ నగర్‌గా బోర్డు ఏర్పాటు చేశారు.దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలా బోర్డు ఏర్పాటు చేయటం వద్ద ఒకింత అయోమయానికి గురయ్యే అవకాశం ఉంటుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ బోర్డు ను మార్పు చేసి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హైవేలో భూములు కోల్పోయిన వారికి అండగా ఉంటాం

● ఎమ్మెల్యే కొండయ్య

● రూ.1.15 కోట్ల చెక్కుల పంపిణీ

చీరాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి : వాడరేవు - పిడుగుర్ల్లా నూతన జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. భూములు కోల్పోయిన 52మంది రైతులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రూ.1.15 కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దాదాపుగా అర్హులకు పరిహారం అందించినట్లు చెప్పారు. జమ జరగని వారు నేరుగా సంప్రదించి పరిహారం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు. తహసీల్దార్ గోపీకృష్ణ, తదితర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై బైండోవర్ కేసులు

బల్లికురవ. జూన్ 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన రెండు కుటుంబాల వారు తరచూ ఘర్షణలకు పాల్పడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో కౌంటర్ ఫిర్యాదులు చేసుకుంటున్నారు. దీంతో ఎస్‌ఐ నాగరాజు రెండు కుటుంబాల వారికి కౌన్సెలింగ్ చేసి ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆనంతరం రెండు కుటుంబాలకు చెందిన ఎనిమిది మందిపై తహసీల్దార్ రవి నాయక్ సమక్షంలో పోలీసులు బైండోవర్ చేశారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ సాయికి పూజలు

ఏరువాక పౌర్ణమి ఆనంతరం మొదటి గురువారం సందర్భంగా మండలంలోని నక్కబొక్కలపాడు హనుమాన్ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు హారతులు, అభిషేకాలు జరిగాయి. అన్నదానం నిర్వహించారు.

మార్టూరు వ్యవసాయ అధికారిగా లావణ్య

మార్టూరు,జూన్12(ఆంధ్రజ్యోతి):మండల వ్యవసాయ అధికారిగా రామినేని లావణ్య గురువారం మార్టూరులోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె సంతమాగులూరు మండలం నుంచి బదిలీపై మార్టూరు వచ్చారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఇంకొల్లు,జూన్ 11,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నూతన తహసీల్దారుగా ఏవీఎస్ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు.నాగులుప్పలపాడులో రీసర్వే డీటీగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఉద్యోగోన్నతిపై ఇంకొల్లుకు వచ్చారు.ఇప్పటివరకు తహసీల్దారుగా పని చేసిన వెంకటరత్నం ఉద్యోగోన్నతిపై బాపట్లకు బదిలీ అయ్యారు.

నవ వధువు అదృశ్యంపై కేసు నమోదు

కావూరివారిపాలెం((చీరాల), జూన్ 12 (ఆంధ్రజ్యోతి : నవ వధువు అదృశ్యంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాత కావూరివారిపాలెంకు చెందిన యువతికి ఇటీవల వివాహమైంది. ఈక్రమంలో బుధవారం 16రోజుల పండుగకు వచ్చిన ఆమె అర్థరాత్రి నుంచి కనిపించడం లేదు. ఈమేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి,జూన్12(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఏ ఉదయ్‌కుమార్ రూ.1,00,116లు గురువారం అందజేసినట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు.